నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, గురువారం 8 ఫిబ్రవరి 2024 | KHAMMAM

ఖమ్మం ఏఎంసీలో సీసీఐ కొనుగోళ్లు (ఫైల్)

- మద్దులపల్లి ఏఎంసీలో రికార్డు స్థాయిలో లక్ష క్వింటాళ్లు ఖరీదు
- జిల్లాలో 16 వేల మంది పత్తి రైతులకు ప్రయోజనం

8 కేంద్రాలు.. 4.14 లక్షల క్వింటాళ్లు

ఖమ్మం ఏఎంసీలో కొనసాగుతున్న సీసీఐ పత్తి కొనుగోళ్లు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 7 : భారత పత్తి సంస్థ (సీసీఐ) పత్తి కొనుగోళ్లు జిల్లావ్యాప్తంగా 8 కేంద్రాల్లో కొనసాగుతున్నాయి. నిరుడు అక్టోబర్ నుంచి పత్తిని బయ్యర్లు కొనుగోలు చేస్తున్నారు. తొలుత జిల్లావ్యాప్తంగా 10 జిన్నింగ్ మిల్లులను సీసీఐ అధికారులు గుర్తించారు. అయితే వాటిల్లో 8 కేంద్రాల వద్దనే క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది సీసీఐ అధికారులు పత్తికి గరిష్ఠంగా క్వింటాకు రూ.7,020 వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ గణాంకాల ప్రకారం ఇప్పటి వరకు ఎనిమిది కేంద్రాల ద్వారా రైతుల నుంచి సీసీఐ అధికారులు 4.14 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఖమ్మం ఏఎంసీ పరిధిలోని మొత్తం మూడు జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా గుర్తించినప్పటికీ ఒక జిన్నింగ్ మిల్లు (ఖమ్మం జీఆర్ఆర్ ఇండస్ట్రీ) వద్ద మాత్రమే కొనుగోలు జరుగుతోంది. ఈ కేంద్రం ద్వారా ఇప్పటి వరకూ 44.09 వేల క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. మధిర వ్యవసాయ మార్కెట్ పరిధిలో మూడు జిన్నింగ్ మిల్లుల ద్వారా 1.19 లక్షల క్వింటాళ్లు, నేలకొండపల్లి మార్కెట్ పరిధిలోని ఒక జిన్నింగ్ మిల్లు కేంద్రం ద్వారా 71.60 వేల క్వింటాళ్లు, వైరా మార్కెట్ పరిధిలోని ఒక జిన్నింగ్ మిల్లు ద్వారా 30.49 వేల క్వింటాళ్లు, మద్దులపల్లి మార్కెట్ పరిధిలోని మరో రెండు జిన్నింగ్ మిల్లుల ద్వారా 1.49 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. ఈ ఏడాది జాతీయ మార్కెట్లో తెలంగాణ పత్తికి మంచి డిమాండ్ ఉండడంతో ఒకవైపు ప్రైవేట్ వ్యాపారులు, మరో వైపు సీసీఐ అధికారులు పోటీ పడి పంటను కొనుగోలు చేస్తున్నారు. పంట చివరి నాటి వరకూ తాము పంటను కొనుగోలు చేస్తామని సీసీఐ అధికారులు ప్రకటించారు.

సీసీఐ కొనుగోళ్లలో మద్దులపల్లి ఏఎంసీ రికార్డు

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది తాజా గణాంకాల ప్రకారం మద్దులపల్లి మార్కెట్ పరిధిలోని రెండు జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ అధికారులు రికార్డు స్థాయిలో పంటను కొనుగోలు చేశారు. జిల్లా వ్యాప్తంగా మార్కెటింగ్ శాఖ పరిధిలోని ఐదు వ్యవసాయ మార్కెట్ల పరిధిలో భారత పత్తి సంస్థ కొనుగోళ్లను ప్రారంభించింది. అయితే అతి పెద్ద మార్కెట్లను అధిగమించి మరీ మద్దులపల్లి మార్కెట్ పరిధిలోని జిన్నింగ్ మిల్లుల్లో భారీగా క్రయవిక్రయాలు జరిగాయి. జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో 4 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు జరుగగా.. కేవలం మద్దులపల్లి మార్కెట్ పరిధిలోనే 1.50 లక్షల క్వింటాళ్ల పత్తి క్రయవిక్రయాలు జరగడం విశేషం. మద్దులపల్లి జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్లు వద్ద లక్ష క్వింటాళ్ల పత్తిని సీసీఐ అధికారులు కొనుగోలు చేసి రికార్డు సృష్టించారు. సకాలంలోనే పంట సొమ్ము చేతికి వస్తుండడంతో రైతులు కూడా పోటీపడి మరీ సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకొస్తున్నారు.

16 వేల మంది రైతులకు ప్రయోజనం

సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ 16 వేల మంది రైతులకు ప్రయోజనం చేకూరింది. అయితే గుర్తించిన మిగిలిన కేంద్రాల్లో కూడా సీసీఐ కొనుగోళ్లు చేపడితే మరింత మంది రైతులకు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. ఖమ్మం మార్కెట్ పరిధిలోని సీసీఐ కేంద్రం ద్వారా 1,773 మంది రైతులు తమ పంటను విక్రయించగా.. మధిర కేంద్రాల ద్వారా 4,661 మంది, వైరా కేంద్రాల ద్వారా 1,269 మంది, నేలకొండపల్లి కేంద్రాల ద్వారా 2,569 మంది, మద్దులపల్లి కేంద్రాల ద్వారా 6,328 మంది కలిపి మొత్తం 16,600 రైతులు తమ పత్తి పంటను విక్రయించారు.

15 వరకూ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు

అన్ని పంచాయతీల్లోనూ శానిటేషన్ పనులు నిర్వహించాలి: కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప ఆరోగ్య కేంద్రాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పల్లెల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఈ నెల 7 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టినట్లు చెప్పారు. ఈ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 8న యువత, మహిళలు, గ్రామస్తులు, ప్రముఖులు, అధికారులతో శ్రమదానం నిర్వహించాలని సూచించారు. అలాగే, తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. రహదారులపై ఉన్న గుంతలను పూడ్చాలన్నారు. రహదారులపై చెత్త కుప్పలు, మట్టి దిబ్బలను తొలగించి పరిశుభ్రం చేయాలని అన్నారు. 9న శుక్రవారం పంచాయతీల్లో ఉన్న డంపింగ్ యార్డులను సందర్శించి షెడ్లలో సెగ్రిగేషన్ జరిగే విధానాన్ని, కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ఆ షెడ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అన్నారు. 10న రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని, పంచాయతీ పరిధిలోని అన్ని కచ్చా కాలువలను శుభ్రం చేయాలని సూచించారు. గ్రే వాటర్‌ను సోక్ పిట్ వైపు, కిచెన్ గార్డెన్ వైపు మళ్లించే విధంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. 11న మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయాలని, 12న మురుగు కాల్వలను శుభ్రం చేయాలని, పంచాయతీల్లోని బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. 13న పాఠశాలల పిల్లలకు, దేవాలయాల దగ్గర ఉన్న షాపుల బాధ్యులకు, హోటళ్ల నిర్వాహకులకు ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 14న యువతకు పారిశుధ్య కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించి వారిని ప్రోత్సహించాలని అన్నారు. 15న సామాజిక దురాచారాల నిర్మూలనపై అవగాహన కల్పించాలని, చురుగ్గా పాల్గొన్న వారికి సన్మానం చేయాలని సూచించారు.

'మూడు నెలల నుంచి వేతనాల్లేవ్..!'

ఖమ్మంలోని జిల్లా ప్రధానాసుపత్రి ఎదుట కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ధర్నా

ఖమ్మం పెద్దాసుపత్రి ప్రధాన ద్వారం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 7: మూడు నెలల నుంచి వేతనాల్లేక అల్లాడుతున్నామని, దీంతో కుటుంబాలను పోషించుకోవడానికి ఇబ్బంది అవుతుందని ఖమ్మం నగరంలోని జిల్లా ప్రధానాసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని జిల్లా ప్రధానాసుపత్రి ఎదుట బుధవారం వివిధ కార్మిక సంఘాలతో కలిసి నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. మూడు నెలల నుంచి కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్మికులకు జీతాలు ఇవ్వాలని సదరు కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా రాష్ట్రప్రభుత్వం తమకు ముట్టజెప్పాల్సిన నిధులను ఇవ్వడం లేదని సమాధానమిచ్చారన్నారు. వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులను ప్రశ్నిస్తే రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకుని నిధులు విడుదల చేయాలని, తమ చేతిలో ఏమీ లేదని చేతులు దులుపుకుంటున్నారని మండిపడ్డారు. ఇలా రాష్ట్ర ప్రభుత్వం, వైద్యాధికారులు, కాంట్రాక్టరు కలిసి కార్మికుల పొట్టకొడుతున్నారన్నారు. కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ప్రధానాసుపత్రి ప్రధాన ద్వారం వద్ద సుమారు రెండు గంటలపాటు ధర్నా చేపట్టారు. దీంతో పౌరులకు వైద్యసేవలు అందించడంలో వైద్యులు, వైద్యసిబ్బందికి ఆటంకం కలిగింది. వెంటనే ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఆర్ఎంవో అమర్‌సింగ్ కార్మికుల వద్దకు వచ్చారు. రెండు వారాల్లోపు కార్మికులకు వేతనాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళనను విరమించారు. ధర్నాలో వివిధ కార్మిక సంఘాల నాయకులు జీ రామయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, అంబేద్కర్, జగదీశ్, వెంకటరమణ, విజయమ్మ, మమత, ఉదయ్‌కుమార్, అశోక్‌కుమార్, వెంకటేశ్, అపర్ణ, కవిత, అనిల్‌కుమార్, ఉపేందర్, మహేశ్, శ్యాం పాల్గొన్నారు.

సమన్వయంతో జాతర విధులు నిర్వర్తించాలి

- భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలి
- పార్కింగ్ ప్రదేశాలను గుర్తించి చదును చేయండి
- తీర్థాల జాతర నిర్వహణపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష

మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 7 : భక్తులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో జాతరలో విధులు నిర్వర్తించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తీర్థాల గ్రామంలో గల సంగమేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష చేశారు. తొలుత ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ మార్చి 7 నుంచి 11వ తేదీ వరకు ఐదు రోజులపాటు తీర్థాల జాతర జరగనున్నట్లు తెలిపారు. సుమారు 5 నుంచి 6 లక్షల మంది భక్తులు జాతరకు తరలి రానున్నట్లు అంచనా ఉందన్నారు. గతంలో కంటే గొప్పగా జాతర జరిగే విధంగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణకు చర్యలు చేపట్టడంతోపాటు గ్రామ శివారులో పార్కింగ్ స్థలాలను గుర్తించి చదును చేయాలన్నారు. మిషన్ భగీరథ నీటిని భక్తుల అవసరానికి తగ్గట్లుగా నిల్వ చేస్తామన్నారు. స్నానాల కోసం నదిలోని నీటిని చెక్‌డ్యాం నుంచి పంపే ఏర్పాట్లు చేయాలన్నారు. రహదారుల ప్యాచ్ వర్క్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కామంచికల్ వద్ద 125 మీటర్ల మేర రోడ్డు పనులు పూర్తి చేయాలన్నారు. పల్లెగూడెం, గోళ్లపాడు రోడ్డు నిర్మాణానికి సర్వే చేసి ప్రతిపాదనలు పంపాలన్నారు. కల్యాణ మండపంతోపాటు నదికి కరకట్ట స్థలం వదిలి డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. సమీక్షలో డీపీవో హరికిషన్, ఉపాధి కల్పన అధికారి కే శ్రీరాం, ఆర్డీవో గణేశ్, ఏసీపీ బస్వా రెడ్డి, పీఆర్ ఈఈ పాండురంగ విఠల్, మిషన్ భగీరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ, మత్స్య శాఖ అధికారి ఆంజనేయులు, దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ గౌరీశంకర్, ఎంపీపీ బెల్లం ఉమ, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన మిర్చి బస్తాలు

ఖమ్మం ఏఎంసీకి ఒకే రోజు 60 వేల మిర్చి బస్తాలు
జెండాపాటలో క్వింటాకు రూ.22,300 పలికిన ధర
రెండు రోజుల వ్యవధిలో రూ.800 పెరుగుదల

మిర్చి బస్తాలతో కిటకిటలాడుతున్న ఖమ్మం ఏఎంసీ యార్డు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 7: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం మిర్చి బస్తాలు పోటెత్తాయి. ఖమ్మం సహా పొరుగు జిల్లాల రైతులు సుమారు 60 వేల బస్తాలను బుధవారం తెల్లవారుజామునే మిర్చియార్డుకు తీసుకొచ్చారు. దీంతో ఈ ఏడాది రికార్డు స్థాయిలో మిర్చి వస్తాలు వచ్చినట్లయింది. మిర్చి బస్తాలు పెద్ద మొత్తంలో తెచ్చిన వారిలో ఖమ్మంతోపాటు సూర్యాపేట, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఏపీలోని కృష్ణా జిల్లాల రైతులు ఎక్కువమంది ఉన్నారు. ఇటీవలి వరుస సెలవుల తరువాత తిరిగి మార్కెట్లో క్రయవిక్రయాలు కొనసాగుతుండడం, మరో నాలుగు రోజుల పాటు మార్కెట్‌కు సెలవులు రావడం వంటి కారణాలతో రైతులు తమ పంటను భారీగా తేవడానికి కారణంగా ఉంది. ఉదయం జెండాపాట సమయానికే సుమారుగా 60 వేల బస్తాలు వచ్చాయి. దీంతో మిర్చియార్డంతా ఎర్రబంగారం బస్తాలతో కిక్కిరిసింది. అనంతరం జరిగిన జెండాపాటలో గరిష్ఠ ధర క్వింటాకు రూ.22,300 పలికింది. అదే విధంగా మధ్య ధర రూ.20 వేలు, కనిష్ఠ ధర రూ.14 వేలు పలికింది. అదే విధంగా తాలు రకం పంటకు క్వింటాకు గరిష్ఠ ధర క్వింటాకు రూ.12 వేలు, మధ్య ధర రూ.11 వేలు, కనిష్ఠ ధర రూ.9 వేల చొప్పున పలికాయి. రెండు రోజుల క్రితం ఇదే మార్కెట్లో మిర్చికి క్వింటాకు రూ.21,500 ధర పలుకగా రెండు రోజుల్లోనే మరో రూ.800 ధర పెరిగింది. దీంతో రూ.22 వేల మార్క్ దాటింది. యార్డుకు భారీగా మిర్చి బస్తాలు వచ్చినప్పటికీ కార్మికులు, ట్రాలీ కార్మికులు తమ పనులు వేగవంతం చేయడంతో సాయంత్రంలోగా కాంటాలు, తోలకాల ప్రక్రియ పూర్తయింది.

రైల్వే లైన్ అలైన్‌మెంట్ మార్చాల్సిందే..

- 'దోర్నకల్ - మిర్యాలగూడ' వల్ల రైతులు భూములు కోల్పోతారు
- లోక్‌సభ సమావేశాల్లో ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు

పార్లమెంట్ సమావేశాల్లో మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం, ఫిబ్రవరి 7: ప్రజలకు, రైతులకు ఇబ్బందికరంగా, నష్టదాయకంగా ఉన్న ప్రతిపాదిత దోర్నకల్ - మిర్యాలగూడ రైల్వేలైన్ అలైన్‌మెంట్‌ను మార్చాల్సిందేనని, దానిపై పునఃపరిశీలన చేయాల్సిందేనని బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు కోరారు. లోక్‌సభ సమావేశాల్లో భాగంగా బుధవారం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. దోర్నకల్ - మిర్యాలగూడ రైల్వేలైన్ అలైన్మెంట్ పురోగతిలో తాను ప్రతిపాదించిన అంశాలను పరిగణనలోకి తీసుకున్నారో లేదోనని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను అడిగారు. ఈ లైన్ కారణంగా ఇక్కడి రైతులు సారవంతమైన, విలువైన వ్యవసాయ భూములను కోల్పోతున్నారని అన్నారు. కాగా, ఎంపీ నామా ప్రశ్నకు రైల్వే మంత్రి సమాధానమిస్తూ.. దోర్నకల్ - మిర్యాలగూడ (97 కి.మీ.) మధ్య కొత్త రైలుమార్గం మంజూరైందని, డీపీఆర్ కోసం సర్వే జరుగుతోందని అన్నారు. రైల్వే ప్రాజెక్టుల అమరిక, కార్యాచరణ, వాణిజ్య అవసరాలు, సాంకేతిక - ఆర్థిక సాధ్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని తదుపరి కార్యాచరణ ఉంటుందని అన్నారు. డీపీఆర్ సిద్ధమైన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

వృత్తిదారుల ఆర్థికాభివృద్ధికి సహకారం

'పీఎం విశ్వకర్మ' అవగాహన సదస్సుల్లో డీఐసీ జీఎం అజయ్‌కుమార్

మాట్లాడుతున్న పరిశ్రమల కేంద్రం జీఎం అజయ్‌కుమార్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 7: సంప్రదాయ కులవృత్తులను లాభదాయకంగా మార్చి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన' పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ) జీఎం అజయ్‌కుమార్ పేర్కొన్నారు. కులవృత్తి, చేతివృత్తి కళాకారుల సంక్షేమానికి అమలు చేస్తున్న ఈ పథకానికి అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఖమ్మం టీటీడీసీలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వడ్రంగి, కమ్మరి, కుమ్మరి, మంగళి, రజక, వడ్డెర, ఔసలి, కంసాలి, దర్జీ వంటి చేతివృత్తులపై ఆధారపడి జీవించేవారంతా ఈ పథకంలో ఆర్థికసాయానికి అర్హులవుతారని వివరించారు. ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, రేషన్ కార్డు వంటి ధ్రువీకరణ పత్రాలతో సీఎస్‌సీ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జ్యోతి మాట్లాడుతూ.. ఈ పథకం కింద లబ్ధిదారులకు మొదటి విడతలో రూ.లక్ష రుణం మంజూరు చేస్తామని, నిర్ణీత వ్యవధిలో తిరిగి చెల్లించిన వారికి మళ్లీ రూ.2 లక్షల రుణం అందిస్తామని తెలిపారు. అనంతరం, బాలానగర్ ఎంఎస్ఎంఈ డీఎఫ్‌వో శివకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ కే.శివరామప్రసాద్ తదితరులు కూడా పవర్ పాయింట్ ప్రజెంటేషన ద్వారా అధికారులు, దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, కార్మికశాఖ డీసీ వెంగమ్మ, మున్సిపల్ అధికారి సుజాత, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి 400 మంది వృత్తిదారులు హాజరయ్యారు.

'ఓటు'కు పెంచిన డేటు..

- భద్రాద్రి జిల్లాలో 40,420 మంది నమోదు
- దరఖాస్తుకు ఆసక్తి చూపని పట్టభద్రులు
- నమోదు చేసుకునేందుకు వచ్చే నెల 24 వరకు వెసులుబాటు
- ఏప్రిల్ 4న తుది జాబితా విడుదల చేయనున్న అధికారులు

ఎమ్మెల్సీ ఓటు హక్కును ఆన్‌లైన్ చేస్తున్న పట్టభద్రులు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఓటు వేసేందుకు పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో ఓటు హక్కు నమోదు తొలుత మందకొడిగా సాగినా.. అధికారులు దీనిపై విస్తృతంగా ప్రచారం చేశారు. అయినా పట్టభద్రులు ఓటు నమోదుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. డిగ్రీ పూర్తి చేసిన వేలాది మంది నిరుద్యోగులు తమకు ఉద్యోగాలు రాకపోవడంతో ఓటు వేసినా ఫలితం లేదనే ఉద్దేశంతో ఓటరుగా నమోదు చేసుకోవడం లేదని చెబుతున్నారు. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్ పట్టభద్రుల ఓటర్ల నమోదుకు మార్చి 24వ తేదీ వరకు వెసులుబాటు కల్పించింది.

జిల్లాలో 40,420 మంది నమోదు

నెల రోజుల నుంచి ఓటర్ల నమోదుకు అవకాశం ఇచ్చినా పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోలేదు. ఆన్‌లైన్‌లో సర్వర్ పని చేయకపోవడం వల్ల చేద్దాంలే.. చూద్దాంలే.. అనుకొన్న కొందరు చివరి వరకు చూసి నమోదు చేయకుండా వదిలేసుకున్నారు. దీంతో మొదటి విడతలో ఇప్పటివరకు 40,420 మంది పట్టభద్రులు ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. ఇందులో ఆన్‌లైన్‌లో 39,991 మంది దరఖాస్తు చేసుకోగా.. 429 మంది ఆఫ్‌లైన్ ద్వారా నమోదు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఓటరు ఇంటికి వెళ్లిన బీఎల్‌వోలు దరఖాస్తుదారుల పత్రాలను సరిచూసి నమోదు చేసుకున్నారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటర్లుగా 44 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది 54 వేలకు మందికి పైగా పట్టభద్రులు జిల్లాలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇంకా 14 వేల మందికి పైగా ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

మార్చి 24 వరకు అవకాశం..

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా కోసం ఈ నెల 22న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మొదటి విడతో ఈ నెల 6వ తేదీ చివరి రోజు అయినప్పటికీ మరోసారి ఓటర్లకు అవకాశం కల్పించేందుకు వెసులుబాటు కల్పించారు. మార్చి 24వ తేదీ వరకు పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చు. ఏప్రిల్ 4వ తేదీన తుది జాబితా విడుదల చేయనున్నారు.

ఓటు నమోదు చేసుకోవాలి

డిగ్రీ పూర్తి చేసిన ప్రతి పట్టభద్రుడు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి. మార్చి 24వ తేదీ వరకు అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లో కాకపోతే తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా దరఖాస్తులను బీఎల్‌వోలు వచ్చి వెరిఫికేషన్ చేస్తారు. గ్రామ, మండల, పట్టణ స్థాయిలో ఓటు నమోదుపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం.

- ప్రియాంక ఆల, భద్రాద్రి కలెక్టర్

కార్తీకకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

కార్తీకను అభినందించిన పీవో

భద్రాచలం, ఫిబ్రవరి 7: ఇల్లెందులోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బాదావత్ కార్తీకను ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, హెచ్ఎం పద్మావతి అభినందించి, సర్టిఫికెట్ అందజేశారు. కార్తీక సైన్స్‌ఫెయిర్‌లో అద్భుత ప్రతిభ చూపుతున్నది. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ -2024లో బెస్ట్ స్టూడెంట్ పర్ఫార్మెన్స్‌లో ఎంపికైంది. జనవరి 26 పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కూడా ఆమె కలుసుకున్నారు.